క్లుప్తంగా

శ్రీరంగనాయకస్వామి ఆలయ ఈఓగా సత్యప్రసాద్‌బాబు



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీరంగనాయకస్వామి వారి ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఎం సత్యప్రసాద్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో పని చేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఈఓగా పని చేస్తున్న కేవీ గోపాలరావు నుంచి సత్యప్రసాద్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు గోపాలరావు, పూర్వ ఈఓ, తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

మజ్జిగ పంపిణీ



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ప్రాంగణంలో మీకోసం సమావేశపు హాలు వద్ద స్వచ్ఛ కలెక్టరేట్ ఆధ్వర్యాన సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల కోసం ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ పంపిణీని డీఆర్వో చంద్రశేఖరరావు ప్రారంభించారు. డీఆర్వో మాట్లాడుతూ వేసవిలో అర్జీదారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛ కలెక్టరేట్ ప్రతినిధి తూము వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేఆర్‌సీసీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ బీ శ్రీదేవి, కలెక్టరేట్ ఏఓ సీహెచ్ వీరాంజనేయప్రసాద్, కలెక్టరేట్ రెవిన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పామర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రక్తదాతలు

భర్త 73వ సారి, భార్య 8వ సారి



కస్తూరి విజయ్ కుమార్



విజయలక్ష్మి

చల్లపల్లి: చల్లపల్లికి చెందిన కస్తూరి విజయ కుమార్ 73వ సారి రక్తదానం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. భర్త అడుగుజాడల్లోనే తాను కూడా అంటూ కస్తూరి విజయలక్ష్మి ఎనిమిదో సారి రక్తదానం చేసి ఇద్దరూ ఆదర్శ దంపతులుగా నిలిచారు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ నిమిత్తం బషీర్ అనే వ్యక్తికి నాలుగు యూనిట్లు రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న విజయ్ దంపతులు విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు. తన భర్త విజయ్‌ను చూస్తుంటే గర్వంగా ఉంటుందని, తన భర్త బాటలోనే తాను కూడా రక్తదానం చేస్తున్నట్లు విజయలక్ష్మి తెలిపారు.

పెళ్లి పేరుతో మోసం చేశాడని యువతి ఫిర్యాదు

చల్లపల్లి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ వ్యక్తి తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఓ యువతి ఫిర్యాదు చేయడంతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. చల్లపల్లి ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామానికి చెందిన ఓ యువతి స్థానికంగా ఉన్న షాపులో పనిచేస్తోంది. అదే షాపులో ఉంటున్న మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తి యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి యువతిపై పలుమార్లు అత్యాచారం చేశాడు. తనను పెళ్లి చేసుకోకుండా కాలం నెట్టుకురావడంతో యువతి సతీష్‌ను నిలదీసింది. పెళ్లికి ససేమిరా అనడంతో తనకు న్యాయం చేయాలని చల్లపల్లి పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అవనిగడ్డ: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు డివిజన్ ఈఈ డీ కృష్ణనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఓఎన్‌జీసీ నిర్లక్ష్యానికి నిదర్శనం

- నేటికీ వినియోగంలోకి రాని పబ్లిక్ టాయిలెట్లు
- రూ.23 లక్షలతో నిర్మించినా.. ఫలితం శూన్యం



పూర్తిగా దెబ్బతిన్న టాయిలెట్ల నిర్మాణాలు



నాగాయలంక గ్రంథాలయం ఎదుట నిర్మితమైన ఓఎన్‌జీసీ పబ్లిక్ టాయిలెట్లు

నాగాయలంక: మండలంలోని వక్కపట్లవారిపాలెం వద్ద చమురు, సహజ వాయువులు వెలికితీస్తున్న ఓఎన్‌జీసీ సంస్థ అధికారులు సామాజిక బాధ్యత పేరుతో నాగాయలంక మెయిన్ రోడ్డులోని బ్రాంచి గ్రంథాలయం ఎదుట, పంచాయతీ పబ్లిక్ పార్కు పక్కన ఏడేళ్ల క్రితం సీఎస్‌ఆర్ నిధులు రూ. 24లక్షలతో ఆధునిక పబ్లిక్ టాయిలెట్లు నిర్మించారు. అయితే ఈ టాయిలెట్లు ప్రస్తుతం నిరుపయోగంగా మిగిలినా ఎవరికీ పట్టడంలేదు. సామాజిక బాధ్యతగా పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఆధునిక టెక్నాలజీ బాక్స్‌లతో నిర్మించి ప్రారంభించారు. ఆ తర్వాత ఈ పబ్లిక్ టాయిలెట్లను పట్టించుకోకుండా పోయారు. అయితే ఈ విషయంలో పంచాయతీ బాధ్యత కూడా ఏమిటో తెలియకపోవడంతో ఈ ప్రాజెక్ట్ పబ్లిక్‌కు పూర్తిగా నిరుపయోగంతో పాటు కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది.

అధికారుల మధ్య సమన్వయలోపం

ఓఎన్‌జీసీ చూపిన సామాజిక బాధ్యతను పంచాయతీకి స్వాధీనం(అప్పగింత) చేయకపోవడం, అప్పగించనిదే రెగ్యులర్ నిర్వహణ సాధ్యం కాదని పంచాయతీ అధికారులు ఇరువైపులా గాలికి వదిలేశారు. దీంతో పబ్లిక్ ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు మరుగుదొడ్లను వాడేయడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గ్రంథాలయం గోడకు ఈ టాయిలెట్స్, పిల్లల పబ్లిక్ పార్కు ఆ చెంతనే ప్రజల కోసం నిర్మించిన నాంది(డాక్టర్) శుద్ధి వాటర్ ప్లాంట్ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి వినియోగం లేక పోవడం, చెత్తా చెదారం పేరుకుపోవడం, మద్యం సీసాలకు అడ్డాగా మారడంతో ప్రస్తుతం ఈ పబ్లిక్ టాయిలెట్ల పరిస్థితి తీవ్ర అభ్యంతరకరంగా మారింది.



చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

దుర్గంధం వ్యాపిస్తోంది



ఓఎన్‌జీసీ నిర్మించి వదిలేసిన పబ్లిక్ మరుగుదొడ్ల కారణంగా వీటి వెనుకనే ఉన్న గ్రంథాలయంలో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుపయోగంగా ఉన్న వీటిని ఎవరుపడితే వారు ఇష్టం వచ్చినట్లు వినియోగించడం, నీళ్ల లేకపోవడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. నిర్మించి వదిలేసిన ఓఎన్‌జీసీ అధికారులే ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది.

– దీ రామకృష్ణ హరనాథ్,
గ్రంథాలయాధికారి, నాగాయలంక

పంచాయతీకి అప్పగించలేదు



పార్కు పక్కన మెయిన్ రోడ్డులో సీఎస్‌ఆర్ నిధులతో ఓఎన్‌జీసీ అధికారులు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించినప్పటికీ ఇంత వరకు పంచాయతీకి అప్పగించలేదు. దీంతో మేము నిర్వహణ చేపట్టలేకపోతున్న మాట వాస్తవం. నిర్వహణ కోసం ప్రతి ఏటా ఆ సంస్థ నిధులు ఇస్తుందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ముందుగా ఓఎన్‌జీసీ సంస్థ పంచాయతీకి టాయిలెట్లు అప్పగిస్తే నిర్వహణ చర్యలు తీసుకుంటాం.

– జరుగు పవన్‌కుమార్,
గ్రామ పంచాయతీ కార్యదర్శి, నాగాయలంక

ప్రశాంతంగా ప్రారంభమైన ‘పది’ పరీక్షలు



మచిలీపట్నంలో నిర్మల హైస్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు



కృత్తివెన్ను మండలంలోని సంగమూడి పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

నాగాయలంక: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని నాగాయలంక-ఏ, నాగాయలంక-బీ, తలగడదీవి హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో 418మందికి గాను 366మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు.

కృత్తివెన్ను: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 383 మంది విద్యార్థులకు గాను 376 మంది హాజరైనట్లు ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు. విద్యార్థులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు.

చల్లపల్లి మండలంలో..

చల్లపల్లి: చల్లపల్లి మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో 780 మందిగానూ 778 మంది హాజరయ్యారు. అలాగే ముగ్గురు ప్రవేట్ విద్యార్థులకు ఇద్దరు హజరయ్యారు. గుడివాడ డివిజన్ డీవైఈఓ కొండా రవికుమార్ తన సిబ్బందితో కలిసి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

ఘంటసాల: మండలంలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ- 2 ఎండీ మోమిన్ తెలిపారు. ఘంటసాల మండలంలో మొత్తం 207 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు.

పెడన: పదో తరగతి పరీక్షలకు మండలంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేయగా సోమవారం 574 మందికిగాను 564 మంది హాజరయ్యారు. మొదటి రోజు ప్రశాంతగా పరీక్ష ముగిసిందని ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను గుడివాడ డీవైఈవో పద్మారాణి, పెడన ఎంఈఓ-2 హరనాథ్, పెడన ఇన్‌ఛార్జి తహసీల్దారు అనిల్‌కుమార్‌లు పరిశీలించారు.

మోపిదేవి: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలు మోపిదేవిలో 158 మంది, పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో 72, మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాల కేంద్రంలో 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ దుర్గాసాగర్ తెలిపారు.

అవనిగడ్డ: అవనిగడ్డలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 559 మందికిగానూ 555 విద్యార్థులు హాజరయ్యారు.

గూడూరు: మండలంలో 396 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రమైన గూడూరు పరీక్ష కేంద్రంలో 201 మంది, మల్లవోలులో 153, కంకటావలో 46మంది పరీక్షలు రాశారు.

బంటుమిల్లి: మండల పరిధిలో పది పరీక్షలకు సోమవారం 736 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ బీ త్రిపురసుందరి దేవీ తెలిపారు. పరీక్ష కేంద్రాలను డెప్యూటీ విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో స్కాడ్ బృందం సందర్శించింది.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మచిలీపట్నం నగరంలోపాటు మండల పరిధిలో మొదటి రోజు పరీక్షను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను పలువురు అధికారులు పరిశీలించారు. మచిలీపట్నం నగరంలోని పలు పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

పేర్ని నానిని కలిసిన పెడన నాయకులు



మాజీ మంత్రి పేర్ని నానిని సత్కరిస్తున్న పెడన వైఎస్సార్ సీపీ నాయకులు

పెడన: పెడన నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని)ని మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల పెడన నియోజకవర్గంలోని పలువురు నాయకులకు వివిధ పార్టీ పదవులను ఇచ్చారు. దీంతో వారంతా పేర్ని నానిని కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నానిని కలిసి వారిలో వైఎస్సార్ సీపీ పెడన మండల అధ్యక్షుడు దావు బైరవలింగం, జిల్లా అధికార ప్రతినిధి గరికిపాటి వెంకటరామానాయుడు, రైతు విభాగం జిల్లా కన్వీనర్ తిరుమాని శ్రీనివాసరావు, నాయకులు పామర్తి బెనర్జీ, దావు శ్రీనివాసరావు, ఆర్ వెంకట్రామయ్య, శింగంశెట్టి రాంబాబు తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారు అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

పెడన: పెన్షనర్ల ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ పెడన శాఖ అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పెడన తహసీల్దారు కే అనిల్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ వేయకుండా తాత్సారం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ బకాయిలతో పాటు డీఆర్ బకాయిలను తీర్చాలని కోరారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. సంఘ నాయకులు మల్లయ్య, ఎస్ రామకృష్ణ, అబ్దుల్ హమీద్, తోట సత్యనారాయణ, బీఎస్ఎస్ మీనాకుమార్, ఎం అలీం, ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బంటుమిల్లి: విశ్రాంత ఉద్యోగుల సంఘం బంటుమిల్లి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్పందనలో అర్జీ సమర్పించారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలకు హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలంటూ పలు డిమాండ్లతో తహసీల్దార్ కే పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షుడు సీహెచ్ గంగాజలరావు, కార్యదర్శి జే భాస్కరరావు, సభ్యులు నగేష్, నాగభూషణం, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కృత్తివెన్ను: సీపీఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మండలంలోని కృత్తివెన్ను, సంగమూడి, గుడిదిబ్బ కాలనీల్లో సోమవారం ఆ పార్టీ నాయకులు పర్యటించారు. కాలనీల్లో తాగునీరు, డ్రెయినేజీ, అంతర్గత రోడ్ల సమస్యలతో పాటు సంగమూడి కాలనీ వాసులకు శ్మశానం సమస్య కూడా ఉన్నట్లు తమకు ప్రజలు తెలిపారని చెప్పారు. ఈ నెల 24వ తేదీన అన్ని తహసీల్దార్, సచివాలయాల వద్ద నిరసన తెలిపి అర్జీ రూపంలో సమస్యలను అధికారులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు పరుచూరి ధనశ్రీ, అంకాని శ్రీనివాసరావు, మాజేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

11 చోట్ల షట్టర్లు ఏర్పాటు

అవనిగడ్డ: అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో 11 చోట్ల పంటకాలువలకు నూతన షట్టర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని సోమవారం ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. రూ. 28.20లక్షల రాష్ట్ర విపత్తుల నిధులతో మందపాకల ఛానల్ పూడికతీతతో పాటు 11 చోట్ల నూతన షట్టర్లను ఏర్పాటు చేయనున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

చల్లపల్లి: చల్లపల్లికి చెందిన పేద విద్యార్థినికి చదువు నిమిత్తం రావేళ్ల ట్రస్టు చైర్మన్ రావేళ్ల ఉదయ్ రూ.10వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. మండల పరిధిలోని మేకావారిపాలెంలో ఉన్న రావేళ్ల కన్వెన్షన్ హాల్లో విద్యార్థిని భవ్యకు నగదును అందజేశారు. అలాగే విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరికి ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున ఇచ్చినట్లు ఉదయ్ తెలిపారు. ట్రస్టు అధ్యక్షుడు నిడమానూరి దిలీప్‌కుమార్, పరుచూరి సురేష్, కృష్ణమోహన్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలను బతికించండి



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘ నాయకులు

పెడన: చేనేత సహకార సంఘాలను బతికించి నేత కార్మికుల ఆకలిచావులను నిలువరించాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘ నాయకుడు కట్టా హేమసుందరరావు డిమాండ్ చేశారు. రాష్ట నాయకత్వం పిలుపు మేరకు పెడన శాఖ నాయకులు పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శనను సోమవారం మహాత్మగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా హేమసుందరావు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ. 72 కోట్ల బకాయిలు చెల్లించకుండా సహకార సంఘాలను నిర్వీర్యం చేసి చేనేత కార్మికులకు పని లేకుండా చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తంతో సహా అన్ని పథకాలు రద్దు చేసి చేనేత కార్మికులను నిలువునా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరిశెట్టి ఉమాకాంతం, కోసనం బాలసుబ్రహ్మణ్యం, జాగా బత్తుల ఉమామహేశ్వరరావు, బళ్ల మల్లికార్జున, పిచ్చుక సోమేశ్వరరావు, కురుమ శ్యాంప్రసాద్, పడవల కోటిలింగం, కుర్మా విగ్నేశ్వరరావు, బట్ట రవీంద్ర పాల్గొన్నారు.

• ఆదమరిస్తే అపాయమే



చల్లపల్లి-మచిలీపట్నం రోడ్డులో కింద వేలాడుతున్న వైరు

చల్లపల్లి: చల్లపల్లి-మచిలీపట్నం రోడ్డులోని ఎస్‌బీఐ వద్ద రోడ్డు పక్కన కేబుల్ వైరు పూర్తిగా కిందికి జారిపోయి ప్రమాదకరంగా మారింది. నాలుగు రోజుల నుంచి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారు లేరు. పాదచారులకు సైతం నడుము ఎత్తులో ఉండటంతో పలువురు కరెంటు వైర్లు అనుకుని భయపడుతున్నారు. దగ్గరకు వచ్చే వరకు వైరు కనిపించకపోవడంతో ఒక్కసారిగా చూసి కంగారు పడుతున్నారు. రాత్రిళ్ల పలువురు వాహన చోదకులకు మెడకు తగిలి పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడే ఉన్న ఎస్ఆర్‌వైఎస్‌పీ స్కూల్‌లో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కూడా ప్రారంభం కావడంతో పరీక్షలు రాసేందుకు వచ్చిన పిల్లలు ఈ వైరును చూసి భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి స్తంభాల మధ్య వేళాడుతున్న వైరును సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నంటౌన్: స్థానిక జవ్వారుపేట సెంటర్‌తో పాటు ఆ సెంటర్ నుంచి చల్లపల్లి రోడ్డు, నాగపోతరావుసెంటర్ రోడ్డులో ఇరువైపులా ఉన్న ఆక్రమణల ను సోమవారం తొలగించారు. జేసీబీ, క్రేన్‌లతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగాల సిబ్బంది ఈ తొలగింపును నిర్వహించారు. కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరిప్రసాద్ ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు.

నేటి నుంచి చిట్టి పిళ్లారయ్య వార్షికోత్సవాలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో వేంచేసి ఉన్న శ్రీ వల్లభాంబా సమేత మహాగణపతి పంచాయతన క్షేత్రం(శ్రీ చిట్టి పిళ్లారయ్యస్వామి) వార్షికోత్సవాలకు సిద్ధమైంది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం నుంచి 24వ తేదీ వరకు వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపింది. 20న సాయంత్రం భగవద్గీత పారాయణ, 21న శ్రీ శివపార్వతుల కల్యాణం, 24న అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఎలుకల నివారణ పద్ధతులపై అవగాహన



తాడేపల్లి(ఘంటసాల): ఎలుకల యాజమాన్య పద్ధతులను సక్రమంగా పాటిస్తే పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవచ్చునని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డీ సుధారాణి అన్నారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు వేపాకు కషాయం, ఎలుకల నివారణ పద్ధతులపై సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా బ్రమోడియోలిన్ విషపు ఎర తయారీ విధానాన్ని, పాటించాల్సిన మెళుకువలను రైతులకు వివరించారు. చీడపీడలు నివారణకు వేపాకు కషాయం తయారీని తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కే రేవతి, రైతులు పాల్గొన్నారు.

స్త్రీ వ్యక్తిత్వాన్ని వివరించిన మొల్ల

గుడివాడ టౌన్: స్త్రీ యొక్క వ్యక్తిత్వాన్ని సమాజానికి తేటతెల్లం చేసిన మహాకవయిత్రి మొల్లమాంబ అని విజయవాడ సిద్ధార్థ కళాశాల అధ్యాపకురాలు గోవాడ శేషారత్నం అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మొల్ల రచించిన రామాయణం, సాహిత్యాలపై సోమవారం సదస్సు నిర్వహించారు. రామాయణంలో సీతతో పాటు అందులోని పలువురు మహిళల వ్యక్తిత్వాన్ని, మానసిక స్థితిని ఆమె వివరించారన్నారు. మహిళలు తమకు ఇష్టం లేకపోతే విభిన్నమైన భావాలను వ్యక్తం చేస్తారని, సీత పాత్ర ద్వారా మొల్ల తెలియజేశారన్నారు. అనంతరం గోవాడ శేషారత్నంను సత్కరించారు. కార్యక్రమంలో భారతీ సమితి అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్‌బీ ప్రసాదు, ఎం. మాధవరావు, సమితీ సభ్యులు వి.వి.రాఘవాచారి, అవిర్నేని వెంకటేశ్వరరావు, జన్ను చిరంజీవి, సీహెచ్. రూప, ఎన్. దీవెన, సీహెచ్. శకుంతల, తాతా పద్మలత, రాజకుమారి, కె. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



పతకాలతో కరాటే విజేతలు

బంటుమిల్లి: మండల పరిధిలోని జయపురం గ్రామానికి చెందిన కరాటే మాష్టరు బీ వెంకటరమణ వద్ద శిక్షణ పొందిన పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలిచారు. ఈ నెల 16వ తేదీన మచిలీపట్నంలోని పోలీసు ఫంక్షన్ హాలులో ఆల్ ఇండియా ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించిన పోటీల్లో 11, 12, 13 సంవత్సరాల విభాగాల్లో బంటుమిల్లికి చెందిన పృథ్వీరాజ్ నాయక్ ప్రథమ స్థానం, కొత్తపల్లికి చెందిన అక్షయ ద్వితీయ స్థానం, శ్రవణ్‌రాజు తృతీయ స్థానాలు సాధించారు. విజేతలను కోచ్‌లు ఎస్ వెంకటేశ్వరరావు, బీ రమణ, కేసీలు అభినందించారు.